క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్



మహబూబాబాద్: కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గాంధీపురం వార్డు కౌన్సిలర్ చల్లాల ఉమా భర్త యాకయ్య ఇటీవల మరణించగా బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మానవతా దృక్పథంతో లక్ష రూపాయల చెక్కు పంపగా సోమవారం చైర్మన్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకన్న, మురళీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలుగు రచయితల మహాసభలకు ఆహ్వానం



కురవి: మండలంలోని తిర్మాలాపురం గ్రామానికి చెందిన రచయిత, కవి, వాస్తు సిద్ధాంతి బొల్లోజు భరత్‌కు ఈనెల 28నుంచి 29తేదీల్లో ఏపీలోని విజయవాడలో నిర్వహించే ప్రతిష్టాత్మకమైన ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు ఆహ్వానం అందినట్లు భరత్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల రిఫరీగా సుధాకర్



డోర్నకల్: హైదరాబాద్‌లో జరుగుతున్న సీఎం కప్ వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు రిఫరీగా డోర్నకల్‌కు చెందిన సీనియర్ వెయిట్‌లిఫ్టర్ మండలోజు సుధాకర్ నియమితులయ్యారు.

రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌ను కలిసిన ప్రవీణ్‌కుమార్



మహబూబాబాద్ రూరల్: రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ గుమ్మడి వెన్నెలను మండలంలోని రెడ్యాల గ్రామానికి చెందిన టీఎస్ఎస్ కళాకారుడు, రచయిత, గాయకుడు దేశెట్టి ప్రవీణ్ కుమార్ హైదరాబాద్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

నైట్‌హాల్ట్ సర్వీస్‌ను పునరుద్ధరించాలి

తొర్రూరు: హైదరాబాద్‌లోని బోరబండకు నైట్ హాల్ట్ సర్వీస్‌ను పునరుద్ధరించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో డీఎం పద్మావతికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్టీబీఐ రజితారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రతికంఠం దేవేందర్‌రాజు, వెన్నం సోమిరెడ్డి పాల్గొన్నారు.

డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

డోర్నకల్: కులగణన సర్వేలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్లతోపాటు రెమ్యునేషన్ వెంటనే ఇవ్వాలని యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ కోరారు. ఈ మేరకు మంగళవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ శ్రీనివాస నాయక్, మున్సిపల్ కమిషనర్ వెంకటస్వామికి వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శివప్రసాద్, రాములు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సంక్షేమాధికారి ధనమ్మకు వినతిపత్రం ఇవ్వడంతో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆమెకు బొకే అందజేశారు. కార్యక్రమంలో గౌరమ్మ, సరిత, సుధాకర్, సారయ్య, నరేష్ పాల్గొన్నారు.

బర్తరఫ్ చేయాలి



మహబూబాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతోపాటు మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శివరాజ్ డిమాండ్ చేశారు. బీఎస్పీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, విజయ్‌కాంత్, ప్రసాదరావు, నాగన్న పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్
- ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



కేసముద్రం: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్



నర్సింహులపేట: ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌కు కేక్ తినిపిస్తున్న పాస్టర్లు



డోర్నకల్‌లో క్రిస్మస్ వేడుకలు..



కురవి: వేడుకల్లో పాల్గొన్న తహసీల్దార్, ఎంపీడీఓలు

కేసముద్రం/నెల్లికుదురు/గూడూరు: అన్నివర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పాటుపడుతుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మంగళవారం కేసముద్రం, ఇనుగుర్తి మండల కేంద్రాల్లోని స్త్రీ శక్తి భవన్, చర్చిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కేసముద్రం, ధన్నసరి సొసైటీ వైస్ చైర్మన్లు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, బండారు వెంకన్న, రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్ రాజు, ఇనుగుర్తి మండల అధ్యక్షుడు సతీష్, మార్కెట్ డైరెక్టర్ వోలం రమేశ్ పాల్గొన్నారు.

ఐక్యతతో ఉండాలి

నర్సింహులపేట/దంతాలపల్లి/మరిపెడ రూరల్: మానవత్వం లోపిస్తే గొడవలు, అల్లర్లు జరుగుతాయని, కాబట్టి ప్రతీ ఒక్కరు ఐక్యతతో ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రార్థన మందిరంలో మంగళవారం నర్సింహులపేట, చిన్నగూడురు మండలాలకు ప్రభుత్వం తరఫున నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ గణేష్, తహసీల్దార్లు నాగరాజు, మహబూబ్ అలీ, పాస్టర్లు ప్రభుచరణ్, సతీష్, రాజేష్, మోషే, సామ్యోల్, వీరన్న, కృపావరం పాల్గొన్నారు.

కురవి: మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీఓ వీరబాబులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్, ఆలయ ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేష్, నాయకులు అవిరె మోహన్‌రావు, ఎన్.రాజేందర్‌కుమార్ పాల్గొన్నారు. కాగా మరనాత టెంపుల్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ సందర్భంగా పేదలకు పండ్లు పంపిణీ చేశారు.

డోర్నకల్: స్థానిక సెయింట్ ఆగ్నేస్ పాఠశాలలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న కేక్ కట్ చేసి పాస్టర్లకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కోటిలింగం, సీరోలు తహసీల్దార్ శారద, డీటీ వీరన్న, బిషప్ మల్సూర్ నాయక్, పాస్టర్లు పాల్గొన్నారు.

బయ్యారం: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలను జీసస్ హోమ్ వర్షిప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుపతి కేక్ కట్ చేశారు.

పనులకు నిధులు కేటాయించండి



రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్, నాయకులు

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని కోర్టు రోడ్డు నుంచి రైల్వే గేటు వరకు రూ.50లక్షల నిధులు కేటాయించి సీసీ రోడ్డు వేయాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డులో రైల్వేలైన్ సందర్భంగా రోడ్డు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని మున్సిపల్ కమిషనర్ రవీందర్ దృష్టికి మంగళవారం తీసుకురాగా పరిశీలించారు. ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా వెంటనే సీసీ రోడ్డు పనులను చేపట్టాలని అందుకు నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బి.నీరజధర్మన్న, డీఈ ఉపేందర్, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, నూనావత్ బాలు, మెతుకు కుమార్‌పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

కురవి: మనువాదుల దాడి నుంచి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కురవిలోని సీపీఐ కార్యాలయంలో మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని మార్చాలనే అమిత్‌షా లాంటి వ్యక్తులు అంబేడ్కర్‌ను అవమానించే విధంగా ప్రవర్తించే మనువాదుల దాడిని తిప్పికొట్టాలన్నారు. సీపీఐ 99 ఏళ్ల ఆవిర్భావ ఉత్సవాలను ఈనెల 26న ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కరణం రాజన్న, నాయకులు బుర్ర సమ్మయ్య, తురక రమేష్, కన్నె వెంకన్న, రామ్మూర్తి, దూదికట్ల సారయ్య, ఉప్పలయ్య, వీరన్న పాల్గొన్నారు.

కాలేజీ హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య

- వరంగల్ నగరంలోని ఏకశిలా గర్ల్స్ క్యాంపస్‌లో ఘటన
- విద్యార్థి సంఘాల ఆందోళన
- అనారోగ్యమే కారణమంటున్న పోలీసులు



కాలేజీ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాలు, బంధువులు

హసన్‌పర్తి: హనుమకొండ పరిధిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న ఓ విద్యార్థిని మంగళవారం ఆ కాలేజీ హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రాంధన్ తండాకు చెందిన గుగులోతు శ్రీదేవి(16) నగరంలోని డబ్బాల్ జంక్షన్ వద్ద గల ఏకశిలా గర్ల్స్ క్యాంపస్‌లో ఇంటర్ (ఎంపీసీ) ఫస్టియర్ చదువుతోంది. రాత్రి 9 గంటలకు కాలేజీ హాస్టల్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన తోటి విద్యార్థినులు కాలేజీ నిర్వాహకులకు చెప్పగా వెంటనే చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా, సదరు విద్యార్థిని శ్రీదేవి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కారణంగానే హాస్టల్ గదిలో ఉరివేసుకుందని చెప్పారు.

విద్యార్థి సంఘాల ఆందోళన..

శ్రీదేవి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు, బంధువులు రాత్రి కాలేజీ వద్దకు భారీగా చేరుకున్నారు. మృతదేహంతో కాలేజీ ఎదుట బైఠాయించారు. శ్రీదేవి మృతికి కళాశాల యాజమాన్యమే కారణమని ఆరోపించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అర్ధరాత్రి వరకు ఆందోళన కొనసాగింది.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ

మరిపెడ రూరల్: తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన మరిపెడ మండలం రాంపురం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ కథనం ప్రకారం.. మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన ఈరగాని ఉపేందర్, సుధగాని బాలాజీ పక్కపక్కనే ఉన్న వీరి కుటుంబాలు ఇంటికి తాళం వేసి తీర్థయాత్రలకు వెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు రెండు ఇళ్ల తాళాలను కట్టర్‌తో కట్ చేసి చోరీకి పాల్పడ్డారు. ఉపేందర్ ఇంటి బీరువా తాళం పగలగొట్టి 28తులాల వెండి, అరతులం బంగారు ఆభరణాలు, అదే విధంగా బాలాజీ ఇంట్లో నుంచి 8తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలిపారు. బాధితుడు ఈరగాని ఉపేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

గూడూరు: మండల కేంద్రంలోని చెంద్రుగూడెంకు చెందిన దిడ్డి సరోజన అనే మహిళకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 39వేల చెక్కును మంగళవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి, మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్, మైనార్టీ సెల్ నాయకుడు ఎండి. యాకూపాష అందించారు.

హామీలను నెరవేర్చని ప్రభుత్వం



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గార్ల: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన లబ్ధిదారులందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పదేళ్లుగా రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకపోవడంతో, అనేక మంది ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా నిష్పక్షపాతంగా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. వరిధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి షరతులు విధించకుండా ధాన్యం కాంటాలు పెట్టాలని కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి వెంకన్న, రమేష్, జనార్దన్, భిక్షమయ్య పాల్గొన్నారు.

అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

- డీఈఓ రవీందర్‌రెడ్డి



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు, డీఈఓ, ఉపాధ్యాయులు

కురవి: పదో తరగతి విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ రవీందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని నేరడ గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి బాలికలకు ఎంఈఓ బాలాజీ, టీచర్ తోడేటి వెంకన్న సహకారంతో అందించిన స్టడీ మెటీరియల్‌ను డీఈఓ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ఉత్తమ ఫలితాలు సాధించడానికి విద్యార్థులు నాలుగు అంశాలను తప్పక పాటించాలన్నారు. వందశాతం హాజరు, చాప్టర్ పార్ట్ టెస్ట్ యూనిట్ వారీగా రాయడం, లిటిల్ టీచర్ లిటిల్ లీడర్ కాన్సెప్ట్ ప్రతి పాఠశాలలో నిర్వహించడం, ప్రతీ ఉపాధ్యాయుడు విషయాల వారీగా విద్యార్థుల అందరిని దత్తత తీసుకోవాలని తెలిపారు. ఈ మూడు నెలలు విద్యార్థులు గ్రూపు డిస్కస్ చేసుకోవాలని, ప్రతి చాప్టర్‌లో పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏసీజీఈ మండుల శ్రీరాములు, ఎంఈఓ బాలాజీ, టీచర్ తోడేటి వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

చిన్నగూడూరు: పదో తరగతి విద్యార్థినులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం దాతల సాయంతో సేకరించిన స్టడీ మెటీరియల్‌ను పదో తరగతి విద్యార్థినులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏసీజీఈ మండుల శ్రీరాములు, ఎంఈఓ రవికుమార్, టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కమిటీ సేవలు అభినందనీయం

- సీడీపీఓ ఎల్లమ్మ



కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎల్లమ్మ, చంద్రశేఖర్

దంతాలపల్లి: మండలంలోని బీరిశెట్టిగూడెంలో గ్రామాభివృద్ధి కమిటీ చేస్తున్న సేవలు అభినందనీయం అని సీడీపీఓ ఎల్లమ్మ అన్నారు. హైకోర్టు న్యాయవాది జెట్టి ఆజాద్ చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిక్షణ పొందిన మహిళలు ఒకటిగా ఏర్పడి పెద్ద సంస్థగా ముందుకు వెళ్లే దిశగా ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మల్లికార్జున్, మహిళ కానిస్టేబుల్ స్వాతి, అంగన్‌వాడీ టీచర్లు, యువకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

పురుగుల మందుతాగి ఆత్మహత్య

నర్సింహులపేట: మండలంలోని పెద్దనాగారం శివారు రేకులతండాకు చెందిన గుగులోతు లచ్చు (55)అనే వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మాలోతు సురేష్ కథనం ప్రకారం.. తండాకు చెందిన లచ్చు మద్యానికి బానిసై నిత్యం తాగడంతో శరీరంలోని అవయవాలు అన్ని దెబ్బతిన్నాయి. ఆరోగ్యం క్షీణించడంతో మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా అస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతు లచ్చు మృతి చెందాడు. మృతుడి భార్య మజ్జి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఈదులపూసపల్లి, అనంతారం గ్రామాల పరిధిలోని వ్యవసాయ బావులకు అమర్చిన మూడు విద్యుత్ మోటార్లు చోరీ జరుగగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి మంగళవారం తెలిపారు. ఈదులపూసపల్లికి చెందిన రైతు గట్ల వెంకన్న వ్యవసాయ బావి వద్ద గల రూ.12వేల విలువ చేసే విద్యుత్ మోటార్ చోరీకి గురైందన్నారు. బయ్యారం మండలానికి చెందిన ఎండీ.గౌస్‌కు చెందిన రూ.15వేల విలువ గల రెండు విద్యుత్ మోటార్లు అపహరణకు గురయ్యాయని తెలిపారు.

వివాహిత బలవన్మరణం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని అయోధ్య గ్రామానికి చెందిన ఉబ్బపెల్లి గణేష్ భార్య దివ్య అలియాస్ సుకన్య (22) మంగళవారం సాయంత్రం ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. జిల్లాలోని మహబూబాబాద్ మండలం అయోధ్య గ్రామానికి చెందిన ఉబ్బపెల్లి ఎల్లయ్య, ఎల్లమ్మ కుమారుడు గణేశ్‌తో సీరోలు మండలం కొత్తూరు (సి) గ్రామానికి చెందిన గొర్రెపాటి జ్యోతి, వీరన్న (లేటు) చిన్న కుమార్తె దివ్య అలియాస్ సుకన్యతో ఈ ఏడాది ఆగస్టు 28వ తేదీన వివాహం జరిగింది. నాలుగు రోజుల క్రితం గణేశ్, సుకన్య కొత్తూరు (సి) గ్రామానికి వెళ్లి వచ్చారు. ఏం జరిగిందో ఏమో కానీ మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుకన్య ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. చీకటిపడ్డాక అత్తమామలు ఎల్లమ్మ, ఎల్లయ్య ఇంటిలోకి వెళ్లి గది వద్ద కోడలి కోసం పిలుస్తుండగా ఆమె బయటకు రాకపోవటంతో తలుపులు తొలగించి చూశారు. అప్పటికే సుకన్య ఉరివేసుకుని ఉండగా తాడు తొలగించి కిందకు దింపి చూసే సరికి మృతిచెందింది. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి సుకన్య మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పోస్ట్‌మార్టం గదికి తరలించారు. మృతురాలి బంధువులు ఆస్పత్రికి చేరుకొని ఆగ్రహంతో భర్త గణేశ్ దాడి చేశారు. పోలీసులు చేరుకుని వారిని అక్కడి నుంచి పంపించారు.

32బస్తాల ధాన్యం చోరీ

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామ శివారులో రైతు పత్రి భరత్ ఆరబోసుకున్న 32 బస్తాల (21 క్వింటాళ్ల) చిట్టిపొట్టి రకం ధాన్యం చోరీకి గురి కాగా మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రెండు రోజుల క్రితం ధాన్యాన్ని బస్తాల్లో నింపి ఉంచి సోమవారం రాత్రి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి రూ.60 వేల విలువగల 32 బస్తాల ధాన్యం కనిపించకపోవటంతో ఆందోళనకు గురై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించాడు.

సంక్షిప్త సమాచారం

పనులు ప్రారంభించాలని వినతి

గూడూరు: మండల కేంద్రంలోని నర్సంపేట వైపు ఎన్‌హెచ్ పక్కన గల సర్వే నంబర్ 8లో గల భూమిలో ఎస్సీ కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులను తొందరగా ప్రారంభించాలని అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందిక సుమన్ హైదరాబాద్‌లో మంగళవారం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఆనంద్‌రావుకు వినతిపత్రం అందించారు.

ఆర్‌ఐకి వినతి

నెల్లికుదురు: 60 ఏళ్ల నాటి నుంచి నడుస్తున్న బాటకు అడ్డంకులను సృష్టిస్తున్న ఎర్రబెల్లి శ్రీనివాసరావుపై వారిపై చర్య తీసుకుని వ్యవసాయ పనులకు వెళ్లేందుకు బాట సౌకర్యం కల్పించి ఆదుకోవాలని బాధిత రైతులు బింగి యాకయ్య, శరత్, నిర్మల కోరారు. ఇనుగుర్తి మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో మంగళవారం బాధిత రైతులు తహసీల్ కార్యాలయంలో ఆర్‌ఐ నర్సింహరావుకు వినతిపత్రం అందించారు.

వ్యవసాయ కూలీలను ఆదుకోవాలి

నెహ్రూసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉపాధి హామీ, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న మంగళవారం డిమాండ్ చేశాడు. ఉపాధి హామీ, వ్యవసాయ కూలీలకు రూ.12వేల భృతి ఇవ్వాలన్నారు. రోజుకు రూ.600 కూలీ చెల్లించాలన్నారు.

ఇంటి స్థలాలను కేటాయించాలి

కేసముద్రం: పేదల కోసం గతంలో కేటాయించిన భూమిలో, ఇంటి స్థలాలను చూపి, ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలంటూ ఇనుగుర్తి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకన్న, నర్సయ్య, ఎల్లయ్య, సత్యం, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ఘన సన్మానం

నెల్లికుదురు: మండలంలోని రావిరాల గ్రామానికి చెందిన అక్కెర ఆనందచారి దంపతులకు హైదరాబాద్‌లోని రవీంద్ర కళాభారతి ప్రాంగణంలో మంగళవారం రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సంగీత అకాడమి చైర్మన్ డాక్టర్ అలేఖ్య చేతుల మీదుగా ఆత్మీయ సన్మానం చేశారు.

వలస కార్మికులను ఆదుకోవాలి

మరిపెడ రూరల్: రాష్ట్రంలో పలు రంగాలలో పని చేస్తున్న వలస కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని వలస కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు బొడ్డు వెంకన్న అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై సర్వే నిర్వహించారు. ఉప్పలయ్య, పటాన్‌పాషా, రాంబాబు పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి

దంతాలపల్లి: షెడ్యూల్డ్ కులాల ప్రజలు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాలను వినియోగించుకోవాలని కార్య నిర్వాహక సంచాలకులు శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని గున్నెపల్లి గ్రామంలో ఎస్సీ కార్పొరేషన్‌పై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వివేక్ రామ్, ఎంపీఓ అప్సర్‌పాషా పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై నిఘా పెట్టాలి

డోర్నకల్: ఎరువుల దుకాణాల్లో విక్రయాలపై అధికారులు నిఘా పెట్టాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు దేవానాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎరువుల దుకాణ యజమానులు కీలక సమయంలో ఎరువుల కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు.

మొక్కల బహూకరణ

మహబూబాబాద్ రూరల్: క్రిస్మస్ సందర్భంగా ఇందిరానగర్ కాలనీలోగల షారోన్ చర్చిలో నిర్వహించిన వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఆర్డీఓ కృష్ణవేణికి ప్రజాహృదయం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు, హరిత మిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న మొక్కలు అందజేశారు.

విద్యుత్ సరఫరా నిలిపివేశారంటూ నిరసన

కేసముద్రం: సర్‌చార్జ్ కింద కొందరు బకాయిలు చెల్లించడం లేదంటూ ఫీడర్ కింద విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారని, దీంతో బకాయిలు చెల్లించిన తమ వ్యవసాయబావుల వద్ద విద్యుత్ లేక పంటల సాగుకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ మండల కేంద్రంలోని పెద్దాయిచెరువు సమీపంలో మంగళవారం రైతులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో రైతులు వెంకన్న, ఆగె శ్రీను, దేవన్న, వెంకన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

కురవి: మండలంలోని అయ్యగారిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి గుగులోత్ రాము తన విధి నిర్వహణలో ఉండగా విధులకు ఆటంక పరిచిన అదే గ్రామానికి చెందిన గజ్జి అఖిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గండ్రాతి సతీష్ మంగళవారం తెలిపారు. కార్యదర్శి రాము గ్రామంలో సర్వే చేస్తుండగా గజ్జి అఖిల్ తన ఇంటి ముందు ఉన్న డ్రెయినేజీ పూడిక మట్టిని తీయాలని సోమవారం సాయంత్రం గొడవ పెట్టుకుని, భౌతికదాడి చేసినట్లు తెలిపారు. రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై విమర్శలు

కేసముద్రం: మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవన్‌లో మంగళవారం అధికారికంగా నిర్వహించిన క్రిస్మస్ ప్రేమవిందు కార్యక్రమానికి ఎమ్మెల్యే మురళీనాయక్ హాజరయ్యారు. కాగా ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ప్రొటోకాల్‌ను ఉల్లంగించి కాంగ్రెస్ పార్టీకి చెందిన జిల్లా నాయకుడి ఫొటో పెట్టడం, స్టేజీపై కొందరు కాంగ్రెస్ నాయకులు కూర్చోవడంపై ప్రతిపక్ష పార్టీల నాయకులు విమర్శలు చేస్తుండటంతో స్థానికంగా చర్చానీయాంశంగా మారింది.

గడ్డివాము దగ్ధం



కేసముద్రం: నిప్పంటుకుని గడ్డివాము దగ్ధమైన సంఘటన ఇనుగుర్తి మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామంలోని ఎం.యాకన్న అనే రైతు, 8 ఎకరాల గడ్డిని ఇంటి ఆవరణంలో వాముగా పేర్చాడు. ఈ క్రమంలో సాయంత్రం గడ్డివామికి నిప్పంటుకోవడంతో, మంటలు వ్యాపించాయి. దీంతో గమనించిన స్థానికులు బిందెలతో నీళ్లు చల్లినప్పటికీ మంటలు ఆరలేదు. సమాచారం మేరకు సంఘటన స్థలం వద్దకు ఫైరింజన్ చేరుకోగా, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. తనపై ఉన్న కక్ష్యతోనే కొందరు వ్యక్తులు గడ్డివామికి నిప్పంటించినట్లు బాధిత రైతు ఆరోపిస్తున్నాడు. గడ్డివాము దగ్ధంతో రూ.50వేల నష్టం వాటిల్లినట్లు తెలిపాడు.